కథాకాలం : 1978

# ఎటుచూస్తే అటుచీకటి

అడుగులు లెక్కబెట్టుకుంటూ నడుస్తున్నాడు లక్ష్మణ్. ఒకటి .... రెండు... ఐదు....పది....ఇరవై ....

ఆగాడు.

జేబులు తడుముకుని బీడీ, అగ్గిపెట్టె బయటికి తీసి పుల్లగీసి బీడీ ముట్టించాడు.

పొగ వేడిగా గొంతు దిగగానే దగ్గుతెర కమ్మి కళ్ళమ్మట నీళ్లొచ్చాయి.

కడుపులో పేగుల్ని బీడీ పొగ కొండచిలువలా చుట్టుకుంది.

మళ్ళీ నడక ప్రారంభించాడు.

ఇరవై .... ఇరవైఐదు .... ముప్పై మూడు ... నలభై .... నలభై ఎనిమిది ...

ఎడమ పక్కకి తిరిగి కర్ర తాటిస్తూ సరిగ్గా ఎనిమిదడుగులు  లేసాడు.

అక్కడ గోడ ఉందని తెలుసు.

కర్ర గోడకి ఆన్చాడు. తడిమితే వీధి పంపు చేతికి తగిలింది.

పంపు తిప్పాడు.

నీళ్ళు సన్నటి ధారలా పడ్డాయి.

కడుపు నిండకముందే పంపులో ధార ఆగిపోయింది.

కళ్ళలో నీళ్ళు తిరిగాయి - బీడీ పొగ వల్ల కాదు.

మళ్ళా నడక ప్రారంభించాడు.

నలభై .... నలభై ఐదు .... యాభై .... డెబ్భైమూడు .... ఎనభై .... నూట అరవై ... రెండువందలు.

అవును. యిదే "రాములోరిగుడి."

ఇక్కడే చందన వుండేది.

చందన ఉంటే తప్పనిసరిగా దాని పాట వుండాలి.

పాట లేదే .... చందన లేదా?

మనసు ఆత్రంగా కొట్టుకుంది.

నిన్ననే లోకల్ రైల్లో కలిసింది. చిడతలు వాయిస్తూ తాను పాట ఎత్తుకోగానే రైలుడబ్బాలో అదే పాట అవతలి వైపునించి ఎంతో చక్కగా వినిపించింది. తన నోటికి బాగా అలవాటైన ఆ పాట అప్పుడు తనకే కొత్తగా అనిపించింది. వెంటనే తన గొంతు సిగ్గుతో ఆగి పోయింది.

తనకు తెలుసు - తాను అప్పుడు పాట ఆపినందుకు రైల్లో జనం సంతోషించే ఉంటారు.

తనకి కోపమొచ్చింది.

డబ్బులు బాగా పడుతున్నాయి దానికి

చిల్లర దాని చేతిలో పడ్డప్పుడల్లా ఆ చప్పుడు తనకి వినపడు తూనే ఉంది.

కాని అదేం చిత్రమో! ఒక పక్క తన మనసు దానిమీద ఉక్రోషంతో మండిపోతున్నా, చేతుల్లో చిడతల వాద్యం ఆగలేదు. దాని పాటకి జోరుగా చిడతలమీద తను లయ వేస్తూనే ఉన్నాడు.

దాని పాట బాగా దగ్గరయింది. ఆగింది.

తన చేతిమీద దాని చెయ్యి పడింది.

దానిమీద కోపం పోయింది. ఆ స్పర్శ తనని తెలియని అను భూతుల్లో ముంచింది.

అప్పుడు కలిగిన హాయి 'ఇదిగో ఇలాటిది' అని తాను నోటితో చెప్పలేడు.

ఎటుచూస్తే అటుచీకటి

బాగా ఆకలితో దహించుకుపోతున్న ఒక రోజున జోలిలో ఎవరు వేసినదో ఒక రొట్టెముక్క చేతికి తగిలినప్పుడు....

ఒకసారి దడదడా పడుతున్న వానలో తలదాచుకోడంకోసం గిజగిజ లాడుతున్న తనని ఎవరో స్కూలుపిల్లడు నడిపించి ఇంటివరకూ తీసి కెళ్ళి వేడి వేడి కాఫీ ఇచ్చి ఆపూటకి అరుగుమీద పడుకోనిచ్చినప్పుడు....

అప్పుడు కూడా తనకంత హాయి అనిపించలేదు .... చేతిమీద పడ్డ చెయ్యి తడిమితే గాజులు తగిలాయి.

"ఇంద" అంటూ తన చేతిలో కొంత చిల్లర పెట్టింది.

"ఎందుకు?" అని అడిగాడు తను.

"సిడత బాగా ఏసినావ్" అంది. ఆ కంఠం చాలా అందంగా అనిపించింది తనకి.

"నువ్వే బాగా పాడినావ్లే....డబ్బులొద్దు ...తీస్కో." అని చేతిలో పడ్డ చిల్లర ఇచ్చేసాడు.

"పేరేమిటి?" అని అడిగింది.

"నీ పేరు సెప్పు."

"చందన."

"నా పేరు లచ్మన్."

"ఏడుంటవ్"

"ఇలాగే అందంట .... అందంట .... ఇప్పుడు రైళ్లో .. .పొద్దుమీకినాక సీతాఫల్మండీ టేసను ఎనక రావిసెట్టు కింద....నువ్వేడుంటావ్?"

"సీతాఫల్మండినే....రాములోరి గుడి లేదా?....అడ"

రైలు ఆగింది. లస్కర్ తరవాత బండి ఆగితే సీతాఫల్‌మండీ స్టేషనే.

చందన సాయంతో తను రైలు దిగాడు.

"నువ్వు రావా?....నేను రెండో ట్రిప్పుకి దిగుతా....మరెల్తున్నా," అని చెప్పింది చందన.

'ఆగు' అన్న తనమాట రైలింజను హోరులో కలిసిపోయింది. పక్క డబ్బాలోంచి చందన పాట వినిపించింది. రైలు కదిలింది. పాట దూరం అయింది.

అడగదల్చుకున్న ముఖ్యమైన ప్రశ్న నోట్లోనే ఉండిపోయింది.

రావిచెట్టు కింద నిద్రపట్టలేదు. చందనని అడగబోయిన ప్రశ్న తనని నిద్రపోనివ్వలేదు.

చందన గురించి తియ్యగా ఊహించుకొంటూ రాత్రి గడిపేశాడు.

చందన ఎలా వుంటుంది?

కళ్ళముందు ఓ రూపం కదిలినట్టయింది.

ఆ రూపం ఎలాంటిదో తనకు స్పష్టంగా తెలియదు.

బాగా చెమటపట్టిన ఒంటికి చల్లగాలి తగిలితే కలిగే హాయిలాంటిది కలిగింది - చందన అస్పష్టమైన రూపం ఊహించుకోగానే.

ఆ తరవాత చందన గొంతు లీలగా తన ఊహకందని ఎవేవో లోకాల లోతుల్లోంచి వస్తున్నట్టుగా అనిపించింది. వినిపిస్తున్నట్టుగా

అనిపిస్తున్న ఆ పాటకి తగ్గట్టు చిడతలమీద లయవేస్తూ నిద్రపట్టని రాత్రి గడిపేశాడు.

పక్కన పడుకున్న సాయిలు నిద్ర పాడుచేస్తున్నావని తిట్టాడు. చిడతలు ఆపమని గోలచేశాడు.

కుష్ఠు సాయిలు వికారంగా, భయంకరంగా ఉంటాట్ట. చేతులు, పాదాలు, ముక్కూ అన్నీ కొరికేసినట్టుండి రోత పుట్టిస్తాయట.

అసలు చేతు లెలా ఉంటాయి? కాళ్లెలాగ ఉంటాయి?

కుష్ఠుసాయి లెలా ఉంటాడు? తానెలా ఉంటాడు?

ఏమో?

కానీ చందన బాగుంటుంది. చాలా అందంగా ఉంటుంది.

ఎలా తెలుసు?

చందన చెయ్యి తన చెయిమీద పడ్డప్పుడు తన కలా అనిపించింది.

చందన పాట లీలగా తన చెవిలో వినబడుతున్నప్పుడు తన కలా అనిపించింది.

చందనని కలుసుకోవాలి.

అడగదలుచుకున్న ప్రశ్న అడిగేయాలి.

అందుకే ఇప్పుడు అడుగులు లెక్కబెట్టుకుంటూ రాములోరి గుడి ముందు కొచ్చాడు.

చందన గుడిముందుంటే తాను వచ్చినట్లు ఎలా తెలుస్తుంది?

గొంతెత్తి పిలుద్దామనుకున్నాడు.

ఎక్కడుందని పిలవటం ? వినపడకపోతే ....

వెంటనే ఆలోచన వచ్చింది.

చిడతలు పైకి తీసాడు.

గట్టిగా వాయించాడు.

అలా వాయిస్తూనే ఉన్నాడు.

అదిగో చందన - పాట ఎత్తుకుంది.

చందన పాట దగ్గరయింది. తన చేతిమీద చందన చేయి పడింది. చల చల్లటి గాలి ఒంటికి తగిలింది.

చందన పాట ఆపలేదు.

తాను చిడతలు ఆపలేదు.

చందన బొచ్చెలో కాబోలు చిల్లర డబ్బులు పడుతున్న శబ్దం వినిపించింది.

మనసులోంచి తెలియని హుషారు పుట్టింది.

పాట ఆగింది.

"చందనా...." అని పిలిచాడు.

"ఆ.. .." అంది. చందన డబ్బులు లెక్కబెడుతున్న శబ్దం వినపడుతోంది.

చిడతలమీద వేలితో గీస్తున్నాడు.

"రాత్రి నిద్రపట్టలేదు" అన్నాడు.

"ఏం?" అని అడిగింది.

సమాధానం చెప్పాలనిపించలేదు. అడగదలచుకున్న ప్రశ్న గొంతులో కొట్టుకుంటోంది.

అడగటానికి తెగింపు చాలటంలేదు.

ఇంకోలా అడిగాడు.

"ఆ సెట్టుమీద కాకులు గోల పెడుతున్నాయి. ఎన్నున్నాయవి?"

చందన నవ్వింది.

"నే నెలా సెప్పగల్ను? కళ్ళున్నోర్నడగాల...."

లక్ష్మణ్ మనసు గిలగిలలాడిందొక్కనిముషం.

"నువ్వు కూడా...." సగంలోనే ఆగిపోయాడు.

"గుడ్డిదాన్నే...." అంది చందన.

వాడి చేయి చందనకోసం తడిమింది.

చందన చెయ్యి అందించింది.

"రాములోరి కళ్యాణమంట రేపు. గుళ్ళో పూజకి జనం దండిగా ఒస్తున్నారు. ఇంకో పాట పాడనా?" అని అడిగింది.

ఎందుకో ఇష్టం కాలేదు.

"ఒద్దు" అన్నాడు.

"జోలెతో రెండు రొట్టెముక్కలున్నాయి. అక్కణ్ణించి నూటేభై అడుగులేస్తే ఊటబావొస్తది. అక్కడికి పోయి తిందామా?" అని అడిగింది.

"ఒద్దు" అన్నాడు మళ్ళా.

"పోనీ నే తింటాను....నువ్వు కబుర్లు సెప్పు...." అంది.

ఇద్దరూ చేతుల్లో చేయివేసుకొని అడుగులు లెక్కబెట్టుకుంటూ నడిచారు.

వాడి కాలికి రెల్లుగడ్డి కనపడని మనసులోని ముల్లులా తగులుతోంది.

పక్షుల అరుపులు వినపడుతున్నాయి.

ఊటబావిలోంచి కీచురాళ్ళ రొద.

"ఇక్కడే...." అంది చందన.

కూర్చున్నారు.

చందన జోలె తడిమి రొట్టెముక్కలు బయటికి తీసి తింటూ కూనిరాగం అందుకుంది.

"చందనా! నువ్వు చాలా అందంగా వుంటావ్...." అన్నాడు లక్ష్మన్

చందన హఠాత్తుగా పాట ఆపి విరగబడి నవ్వింది.

లక్ష్మన్ సంతోషంతో కళ్ళు టపటప లాడించాడు.

చందన వాడి దగ్గరకి జరిగింది. ముఖాన్ని చేత్తో తడిమింది. తలని గుండెకి అన్చుకుంది.

"మంచి వయసులో ఉన్నావ్ - " అని గొణుగుతున్నట్టుగా అంది.

"రాత్రి నాతో ఉండిపో –" అంది.

"ఎందుకు" అన్నాడు - చందన కంఠంలో పలుకుతున్న అందాలకి కరిగిపోతూ.

"రాత్రి నాకాడి కొస్తుంది చంద్రి - కుంటిపిల్ల. అందంగా ఉంటుం దంటారు అంతా. ముప్పయ్యేళ్ళట దానికి....రూపాయిన్నరిస్తే సాలు.... నే సెబుతాలే దానికి ఎక్కువ అడగొద్దని - పాపం కోరిక తీరని మంచి వేడిమీద ఉన్నావ్" అంది.

లక్ష్మన్ హఠాత్తుగా చందనని విడిపించుకుని దూరంగా జరిగాడు.

"నువ్వే కావాలి-" అన్నాడు ఎవరికీ వినపడనట్టు. చందన మనసుకే వినపడేటట్టు.

చందన మళ్లీ నవ్వింది. పగలబడి నవ్వింది. మారాం చేస్తున్న కొడుకుని చూచి ముచ్చటగా నవ్వుతున్న తల్లిలా నవ్వింది.

"నాకు యాభై ఏళ్ళు....నన్నేం చేసుకుంటావ్ ?" అంది.

లక్ష్మన్ గుండెల్లోంచి అస్పష్టమైన సుందర రూపం కరిగిపోతుంటే ఓర్చుకోలేక చిడతలమీద గట్టిగా వాయించడం మొదలు పెట్టాడు. వాడి నీరు నిండిన కళ్ళకి అర్థం చెబుతున్నట్టుగా నూతిలో కీచురాళ్ళు అరుస్తునే ఉన్నాయి.